ప్రజాశక్తి

శుక్రవారం 16 జూన్ 2023

5

అల్లూరి సీతారామరాజు

మురుగునీటితో అవస్థలు

ప్రజాశక్తి-పెదబయలు:సీతగుంట పంచాయతీ పెదబయలు మెయిన్ రోడ్డు పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో డ్రైనేజీ లేక మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది.పాత స్టేట్ బ్యాంక్ సమీపంలో గతంలో సిసి రోడ్డు నిర్మించారు. డ్రైనేజీ నిర్మించక పోవడంతో మురుగు నీరు మెయిన్ రోడ్డుకు చేరుతుంది. దీంతో, అటుగా వెళ్లే వారికి దుర్వాసన వెదజల్లడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు.పంచాయతీ అధికారులు స్పందించి డ్రైనేజీ మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు సమీపాన నిలిచిన మురుగు నీరు

సమస్యలు పరిష్కరించాలని..

అంగన్‌వాడీల ఆందోళనలు

పాడేరులో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

దుంబ్రిగుడలో...

ప్రజాశక్తి-పాడేరు:తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్ల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం పాడేరు, చింతపల్లి మండల కేంద్రాల్లో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు చిన్నయ్య పడాల్, జిల్లా కమిటీ సభ్యులు సుందరరావు, .అంగన్వాడీ జిల్లా అధ్యక్షులు ,కుమారి, చాయిదేవి మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు గ్రాట్యూటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలన్నారు. వేతనంలో సగం పెన్షన్ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు వయోపరిమితి 50 సంవత్సరాల లోపు పెంచాలని, ప్రమోషన్లో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు.. 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు.వేతనంతో కూడిన మెడికల్ లీవ్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు, 2017 నుండి పెండింగ్ లో ఉన్న బిల్లులు, చనిపోయిన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సూపర్ వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించాలన్నారు.

దుంబ్రిగుడ: దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద గురువారం అంగన్వాడీ టీచర్లు ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆ సంఘం మండల అధ్యక్షురాలు కే.కొండమ్మ మాట్లాడుతూ, వేతనాలతో కూడిన మెడికల్ లీవ్ కల్పించాలని, సర్వీసులో ఉండి చనిపోయిన వారి కుటుంబానికి ఉద్యోగం కల్పించాలన్నారు.రిటైర్మెంట్ బెనిఫిట్ రూ 5 లక్షలు చెల్లించి, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల కార్యదర్శి సత్యవతి, నాయకులు, జి.పవిత్ర, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చింతూరులో...

చింతూరు:తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు భాగంగా చింతూరు ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీ కార్యకర్తలు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనం, పింఛను, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐసిడిఎస్ పిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతి, కామేశ్వరి, పొద్దమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి, పిఒకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు రంగమ్మ, కారం సుజాత, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి పూనెం సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను అనేక రెట్లు పెరిగాయని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచలేదని పేర్కొన్నారు. 2017 నుండి టిఎ బిల్లులు ఇవ్వడం లేదన్నారు. తక్షణమే సమస్యలను పరిష్కరించకుంటే జులై 10, 11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరవధిక ఆందోళనలు చేస్తున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రాధ, సోడే కనకమహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : అంగన్వాడీ యూనియన్ జిల్లా నాయకురాలు ఎ.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ అంగన్వాడీలను రెగ్యులర్ ఉద్యోగుల వలే గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు రమణి, సత్యవతి, కుమారి, రత్నం, మేరి, సుందరమ్మ, లక్ష్మేశ్వరి, లక్ష్మి సత్యవతి, మంగమ్మ, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజ ఒమ్మంగిలో...

విఆర్ పురంలో...

ఏజెన్సీ స్కూళ్లకు మైదాన ప్రాంత టీచర్ల బదిలీ సరికాదు

- దీనిపై గిరిజన ఎమ్మెల్యేలు సమాధానం చెప్పాలి

- ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర

ప్రజాశక్తి- పాడేరు, రాజవొమ్మంగి

సుప్రీం కోర్టులో జిఒ నెంబర్ 3పై రివ్యూ పిటిషన్ పెండింగ్‌లో ఉండగా అధికారులు మైదాన ప్రాంత ఉపాధ్యాయలను ఏజెన్సీ ప్రాంత పాఠశాలలకు బదిలీ చేయడం సరికాదని, దీనిని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లోతా రామారావు, కిల్లో సురేంద్ర గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాల్లో గిరిజనులకు నూరు శాతం రిజర్వేషన్లు అమలుకై చట్టం చేయాలని టిఎసిలో తీర్మానం చేసిన గిరిజన ఎమ్మెల్యేలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 400 మంది రెగ్యులర్ టీచర్లను బదిలీ చేశారని తెలిపారు. సుప్రీంకోర్టు జిఓ నెంబరు 3ను రద్దు చేసిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యు పిటిషన్ దాఖలు చేయకుండా, గిరిజన సంఘం దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం మైదానం ప్రాంతం నుండి ఉపాధ్యాయులను ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేయడం గిరిజన నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులను కాలరాయడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వ జోక్యం చేసుకొని షెడ్యూల్ ఏరియాలో జీఓ 3 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే గిరిజనులను సమీకరించి ఐక్య ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యోగాపై అవగాహన

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో యోగపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రూపాల్లో యోగాసనాలు విద్యార్థులతో వేయించారు. అనంతరం సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ సుందరం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగ్గారావు, ఏఎస్ఐ అప్పారావు మాట్లాడుతూ ప్రతిరోజూ యోగా చేయడం వలన శరీర దృఢత్వం, ఆరోగ్యం పెంపొందుతుందని చెప్పారు. ఈనెల 21న యోగా డేను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్ల సాంబమూర్తి, కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా కన్వీనర్ కారే శ్రీనివాస్, సిఆర్పిఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో అడ్మిషన్లు

ప్రజాశక్తి - రంపచోడవరం : రంపచోడవరం మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల (ఇంగ్లీష్ మీడియం)లో 1 నుండి 5వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్టాలిన్ బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లదండ్రులు గమనించి తమ పిల్లలను చేర్చాలని, పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

చాపరాయిలో అక్రమ కట్టడాలు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని పర్యాటక కేంద్రంగా ప్రఖ్యాతి గాంచిన చాపరాయి జలపాతంలో అక్రమ కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. ఎన్‌హెచ్ 516 ఈ విస్తరణ అయిన తర్వాత. ఇక్కడ వ్యాపారం సాగించే గిరిజనేతరులు 1/70 భూబదలాయింపు చట్టానికి విరుద్ధంగా శాశ్వత షాపింగ్‌లు నిర్మించుకుంటున్నారు. జీవన ఉపాధి కోసం బొంగు చికెన్‌తో పాటు చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే స్థానిక గిరిజనులు చిన్న, చిన్న పాకలు వేసుకుంటే వెంటనే తొలగించే అధికారులు మాత్రం శాశ్వత షాపులు నిర్మించుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టీ పట్ట నట్లుగా వ్యవహరిస్తుండటం విశేషం. చాపరాయి జలపాతంలో ఆర్‌అండ్‌బికి సంబంధించిన భూములతో పాటు ఫారెస్ట్ శాఖకు సంబంధించిన భూములు అనుకుని ఉన్నాయి. దీంతో, ఫారెస్ట్ శాఖకు సంబంధించిన భూమిని సైతం ఆక్రమించుకొని కొంతమంది షాపింగ్‌లు, శాశ్వత నిర్మాణాలు చేపడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి గిరిజనేతరుడి షాపును వెంటనే నిర్మాణ దశలోని తొలగించాలని స్థానిక గిరిజనులు కోరుతున్నారు.

అక్రమంగా చేపడుతున్న నిర్మాణం

కోడిగుడ్ల టెండర్లు రద్దు చేయాలి

ప్రజాశక్తి-పెదబయలు రూరల్:అంగన్వాడి కేంద్రాలకు అందిస్తున్న కోడిగుడ్ల టెండర్లను రద్దు చేయాలని గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ, ప్రజా సంఘాల ఐక్యవేదిక కో కన్వీనర్ కుమార్ డిమాండ్ చేసారు. మండలంలో బోయా రాజులు, రాయి మామిడి, గొమంగి తదితర గ్రామాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ, గర్భిణీలు, బాలింతలకు అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారం పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయన్నారు. కోడిగుడ్ల టెండర్లు యజమాన్యం, ఐసిడిఎస్ అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారన్నారు. ఐసిడిఎస్ అధికారులు చోద్యం చూడటం వెనకాల రహస్యం ఏమిటని ప్రశ్నించారు. నియమ నిబంధనల ప్రకారం ఒక కోడి గుడ్డు 50 గ్రాముల బరువు ఉండాలని, కానీ 25 గ్రాములు 30, 35 గ్రాములు ఉంటున్నాయన్నారు. అంగన్వాడి కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకులు ఐసిడిఎస్ పి.డి ముందుగా పరిశీలించిన తర్వాతనే అంగన్వాడి కేంద్రాలకు సరుకులు సరఫరా చేయాలన్నారు. కుళ్ళిపోయిన కోడిగుడ్లు, విరిగిన పాలు ప్యాకెట్లు, నాసిరకమైన సరుకులు అంగన్వాడీ కేంద్రాలకు పంపిణీ చేస్తుంటే ఐసిడిఎస్ అధికారులు పట్టించుకోకుండా ఏమి చేస్తున్నారో చెప్పాలన్నారు.

చిన్న సైజు కోడిగుడ్లను చూపుతున్న నేతలు

ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి డిఇఒ

ఎగ్జిబిషన్లతో విభిన్న ఆలోచనలు

ప్రజాశక్తి-పాడేరుటౌన్:విద్యార్థులలో సృజనాత్మకత, మేధాశక్తి పెంపొందించుకునేందుకు జన్ భగిదరి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఇంచార్జి డిఇఒ జి.అప్పలనాయుడు అన్నారు. అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు గవర్నమెంటు హైస్కూల్‌లో సర్వ శిక్ష అభియాన్ జిల్లా ఎఎంఒ కె.భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం జన్ భగిదరి ఎఫ్ఎల్ఎన్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనా విధానం, చదువు పట్ల ఆశక్తిని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు అవసరమన్నారు. ఎగ్జిబిషన్లో విద్యార్థుల ఆలోచన శక్తితో ఉపాధ్యాయుల సహకారంతో తయారు చేసిన ప్రాజెక్టులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గవర్నమెంటు హైస్కూల్ సిబ్బంది, సెక్టోరియల్ స్టాఫ్, సమగ్ర శిక్షా అభియాన్, డిఇఒ కార్యాలయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితతరులు పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలపై

పోరుకేక పాదయాత్రను జయప్రదం చేయండి

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్ష నాయకులు

ప్రజాశక్తి- విఆర్.పురం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన ఈ నెల 20 నుండి నిర్వహిస్తున్న పోరుకేక మహా పాదయాత్రను జయప్రదం చేయాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు మాట్లాడుతూ మహా పాదయాత్ర విఆర్.పురం మండలంలో ఈనెల 24, 25, 26 తేదీలలో జరగనుందని పేర్కొన్నారు. ఈ పాదయాత్రకు రాజకీయాలకు అతీతంగా అన్ని రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, ఆదివాసీ సంఘాలు మద్దతు తెలియజేసి జయప్రదం చేయాలని కోరారు. పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. నేటి వరకు మొదటి కాంటూర్ నిర్వాసితులకు పూర్తిగా నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఇంకా నష్టపోతున్న వందల గ్రామాల ప్రజలకు పునరావాసం, ఆర్ఆర్ ప్యాకేజీ ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. నిర్వాసితులకు పునరావాసం, ప్యాకేజీ ఇవ్వకుండా ప్రాజెక్టు నిర్మాణం చేయడం ప్రపంచంలో ఎక్కడా లేదని, కాని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులను పూర్తిగా గాలికొదిలేశాయని విమర్శించారు. పునరావాసం తమకు సంబంధం లేదని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చెప్పడం దారుణమన్నారు. ఈ నేపథ్యంలో పోలవరం నిర్వాసితుల సమస్యలను ఎజెండా చేసే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఈ పాదయాత్రకు అన్ని వర్గాల వారు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు బీకర సూర్య ప్రకాష్‌రావు, సుధాకర్, కో ఆప్షన్ సభ్యులు రహీం, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కార్యదర్శి పూనెం ప్రదీప్ కుమార్, కుంజ సుదీర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంఘాల నాయకులు

సభా స్థలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వర్లు

పోరుకేక ప్రారంభ సభ స్థలాన్ని పరిశీలించిన వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఎటపాక

పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర ప్రారంభ సభ స్థలాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. నెల్లిపాకలో ప్రారంభ సభ, తోటపల్లిలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసే స్థలాలను పరిశీలించారు. సిపిఎం పాదయాత్రలో పాల్గొనే నిర్వాసితులకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదని, భోజన బస ఏర్పాట్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కార్యకర్తలకు సూచించారు. అయన వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, పి.బాలకృష్ణ, ఐ అజయ్, హరనాధ్ ఉన్నారు.

బాగా చదివే విద్యార్థులకు ప్రోత్సాహం

జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

బాగా చదివే విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. మండలంలోని ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల ప్రాంగణంలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 2023లో రంపచోడవరం నియోజకవర్గంలో పదో తరగతిలో మొదటి స్థానంలో నిలిచిన కూనవరం జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పోసిన జాహ్నవి శ్రీనిధి (588 మార్కులు)కి రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన దేవీపట్నం మండలం ఇందుకూరుపేట జెడ్‌పి హైస్కూల్ విద్యార్థి కుంచె మహేష్‌బాబు (571 మార్కులు)కు రూ.10వేలు, తృతీయ స్థానంలో నిలిచిన రాజవొమ్మంగి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మిరియాల చరణ్ తేజ్ (565 మార్కులు)కు రూ.5వేలు చొప్పున నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. ఇంటర్మీడియట్ సిఇసి గ్రూపులో ప్రథమ స్థానంలో నిలిచిన దేవీపట్నం ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి చింతల వీర సూర్యదేవి (922 మార్కులు)కు, హెచ్‌ఇసి గ్రూపులో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థి చింతల వీర వెంకటలక్ష్మి (901 మార్కులు)కి, బైపిసిలో ప్రథమ స్థానంలో నిలిచిన కూనవరం ఎపిటిడబ్ల్యుఆర్ కాలేజీ విద్యార్థి కాపారపు ప్రమీల రాణి (987 మార్కులు)కి, ఎంపిసిలో ప్రథమ స్థానంలో నిలిచిన వై.రామవరం ఎపిటిడబ్ల్యుఆర్ కాలేజీ విద్యార్థి కోసూరి సంధ్యారాణి (930 మార్కులు)కి ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున నగదు బహుమతి, సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే సంబంధిత విద్యార్థుల తల్లిదండ్రులను, ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు.

ఈ సందర్భంగా పిఒ సూరజ్ గనోరే మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని అందుకు అనుగుణంగా ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు ఐటిడిఎ ద్వారా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఎంపీపీ బంధం శ్రీదేవి, జెడ్పిటిసి సభ్యురాలు పండ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొమ్మిశెట్టి బాలకృష్ణ, ఏజెన్సీ డీఈవో ఎం.మల్లేశ్వరరావు, ఎంపీటీసీ వంశీ, సర్పంచ్ కుంజం లక్ష్మి, ఎంఇఒలు ఎంవివి.సత్యనారాయణ దొర, సూరిబాబు, హెచ్‌ఎంలు ఎస్.రాజేశ్వరి, వై.లక్ష్మి, ఎల్.మల్లమ్మ, కె.పద్మావతి, ముత్యాలరావు, యుటిఎఫ్ నాయకులు కారం సూరిబాబు, సనాతన బాబు, విల్టన్ బాబు, అనిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాహ్నవికి నగదు బహుమతి

కూనవరం : 2023 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జిల్లా, నియోజకవర్గం టాపర్‌గా నిలిచిన కూనవరం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి పోసిన జాహ్నవి శ్రీనిధికి రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే చేతుల మీదుగా రూ.15వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను గురువారం అందజేశారు. జాహ్నవి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిఒ కోరారు. జాహ్నవి శ్రీనిధి తల్లిదండ్రులను, పాఠశాల ప్రధనోపాధ్యాయులను, ఉపాధ్యాయులను సత్కరించారు.

టెన్త్‌లో నియోజకవర్గం స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులతో పిఒ

స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో ఎయు అద్వితీయ ప్రగతి

-ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో 15వ స్థానం

-ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో ఫోర్ స్టార్ రేటింగ్

మాట్లాడుతున్న ఎయు విసి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఆంధ్రవిశ్వవిద్యాలయం అద్వితీయ ప్రగతి సాధిస్తోందని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఎయు సెనేట్ మందిరంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రారంభించిన తొలి ఏడాది కాలంలోనే కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్‌లో జాతీయస్థాయిలో ఎయు 15వ స్థానంలో నిలచిందన్నారు. అదే విధంగా ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో తొలి సంవత్సరమే ఫోర్ స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా కేవలం ఐదు సంస్థలు మాత్రమే ఫోర్‌స్టార్ రేటింగ్‌ను సాధించాయని, వాటిలో ఎయు ఒకటి కావడం గర్వకారణమన్నారు. జాతీయ విద్యా సంస్థలైన ఐఐటిలతో పోటీ పడుతూ ఎయు ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ పనిచేస్తోందన్నారు. 2024 చివరి నాటికి ఎయులో 200పైగా సంస్థలు పనిచేయడం, నెలకొల్పడం లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే వందకు పైగా స్టార్టప్ సంస్థలు ఎయు కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు.
విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దే సత్తా ఎయులో నెలకొల్పే స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లకు ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల యువతలోని నవ్య ఆలోచనలకు ప్రోత్సహిస్తూ, మార్గనిర్దేశం చేస్తూ వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామన్నారు.
విద్య, వైద్య, రక్షణ, బ్యాకింగ్ రంగాలకు ఉపయుక్తంగా ఎఐ ఆధారిత చిప్‌ను అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేసే దిశగా ఎయులో ప్రారంభించిన సేండ్ లాజిక్ సంస్థ పనిచేస్తోందన్నారు. సంస్థ నిర్వాహకులు డి.కమలాకర్, రవికుమార్‌లను పరిచయం చేసారు. ఎయు నుంచి వచ్చిన గ్రీన్ జామ్స్ సంస్థ పర్యావరణ హిత ఇటుకలను తయారీ విధానం వివరించి, సంస్థ నిర్వాహకులు తరుణ్ జామిని పరిచయం చేసారు. దేశం నుంచి ప్యారిస్ పీస్ ఫౌండేషన్‌తో కలసి పనిచేసే అవకాశం సాధించిన నాలుగో సంస్థగా ఎయులో స్థాపించిన తారమండల్ నిలుస్తుందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు వినీల్ జడ్సన్‌ను పరిచయం చేసారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ రవి ఈశ్వరపు మాట్లాడారు.

ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా సాయిరాం

రిజిస్ట్రార్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న సాయిరాం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా ఇఎన్ఎస్ఇఎన్ఎన్ వ్యవస్థాపకులు, సంచాలకులు సాయిరాం బొల్లా ప్రగడ నియమితులయ్యారు. గురువారం ఎయు విసి ఆచార్య ప్రసాదరెడ్డి సమక్షంలో, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ నుంచి నియామక ఉత్తర్వులను స్వీకరించారు. తన అపార అనుభవంలో విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మలచడానికి, విద్యార్థులకు బోధన, పరిశోధన అంశాలలో సహకారం అందించే దిశగా సాయిరాం బొల్లా ప్రగడ తన సేవలు అందించాలని విసి ప్రసాదరెడ్డి సూచించారు. విశ్వవిద్యాలయం తనకు ఇచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుని, విశ్వవిద్యాలయం, విద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తానని సాయిరాం అన్నారు. ఈ సందర్భంగా సాయిరాంను పలువురు అభినందించారు.

542 జియో సెల్ టవర్ల నిర్మాణాలు

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

సిఎం వీడియో కాన్ఫరెన్సును వీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపి

ప్రజాశక్తి -హుకుంపేట:జిల్లాలో నిర్మాణాలు పూర్తి చేసిన జియో సెల్ టవర్లను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి గురువారం ప్రారంభించారు. పాడేరు డివిజన్ పరిధిలోని హుకుంపేట మండలం భీమవరం, జిమాడుగుల మండలం కిల్లంకోట పంచాయతీ సుబ్బులు గ్రామాల్లో నిర్మించిన జియో టవర్లు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసారంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలకు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు, పాఠశాలలో ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ, పాడేరు ఏజెన్సీలో గత నాలుగైదు సంవత్సరాల క్రితం ఒక నెట్వర్క్ నిర్మాణం ప్రారంభించడం పెద్ద సవాల్‌గా ఉండేదన్నారు. ముఖ్యమంత్రి చొరవతో ప్రధాన కార్యదర్శి ఐటి సెక్రటరీ సూచనల మేరకు ప్రస్తుతం పాడేరు డివిజన్లో పరిధిలో 542 టవర్లు నిర్మాణాలు శర వేగంగా జరుగుతున్నాయన్నారు. నెట్వర్క్ సౌకర్యంతో సచివాలయంలో ఈ క్రాఫ్ట్ బుకింగ్, ఈ కేవైసీ ఇతర పౌర సేవలను సకాలంలో అందించడం జరుగు తుందన్నారు. కొండ శిఖర గ్రామాలలో కూడా నెట్వర్క్ సదుపాయం కల్పించడానికి జిల్లా వ్యాప్తంగా 2265 సెల్ టవర్ల లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు.
అరకు ఎమ్మెల్యే పాల్గుణ మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. సెల్ టవర్ల నిర్మాణంతో నాణ్యమైన పౌర సేవలను త్వరితగతిన అందించగలుగుతామని చెప్పారు. 540 రకాల సచివాలయ సేవలకు నెట్వర్క్ సదుపాయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఆధార్ నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. వికలాంగులకు, అవాతాతలకు సకాలంలో సామాజిక పింఛన్లు అందించడం జరుగుతుందని చెప్పారు. రూ.680 కోట్లతో 317 రోడ్లు నిర్మించామన్నారు. జమ్మి కూడా ఇంజరి వంటి మారుమూల గ్రామాలకు రోడ్లు నిర్మించడం జరిగిందని పేర్కొన్నారు. మనబడి నాడు నేడులో విద్యాలయాలను దేవాలయాల మాదిరిగా అభివృద్ధి చేస్తారని చెప్పారు.
భీమవరం సచివాలయం హార్టికల్చర్ అసిస్టెంట్ కూడా శాంతి కుమారి మాట్లాడుతూ, సెల్ టవర్ లేకపోవడం తో హుకుంపేట మండల కేంద్రంనికి వెళ్లి డేటా ఆన్లైన్లో నమోదు చేయడానికి చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. మూడు నెలల క్రితం జియో టవర్ నిర్మించడంతో భీమవరం పంచాయతీలోని 16 గ్రామాల్లో నెట్వర్క్ సదుపాయం అందుతుందన్నారు. దీంతో, లబ్దిదారులకు సకాలంలో ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామని చెప్పారు. పెన్షన్లు, వైఎస్ఆర్ బీమా, ఈ క్రాఫ్ట్ బుకింగ్, మ్యూటేషన్లు జరుగుతున్న తీరును సీఎంకు వివరించారు, భీమవరం, అండిబ పంచాయతీల పరిధిలో నాలుగు టవర్లు నిర్మించి నెట్వర్క్ సదుపాయం కల్పించినందుకు సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ట్రైకార్ చైర్మన్ శతక బుల్లిబాబు, ఎంపీపీ కూడా రాజబాబు, జెడ్పిటిసి రేగం మత్స్యలింగం, భీమవరం సర్పంచ్ నైని సన్నిబాబు, ఎంపీడీవో వెంకటరావు, తహసిల్దార్ రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ కే వేణుగోపాల్, ఏఈ ధృవకుమార్, సచివాలయం సిబ్బంది, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

టిడిఆర్ హబ్ ఆధ్వర్యంలో రీసెర్చ్ మెథడాలజీ తరగతులు

శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న ఎయు రిజిస్ట్రార్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ హబ్ ఆధ్వర్యంలో హెచ్ఆర్‌డిసి కేంద్రంలో రీసెర్చ్ మెథడాలజీపై శిక్షణ తరగతులను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ ప్రారంభించారు. బ్లెండెడ్ విధానంలో రెండు వారాలపాటు శిక్షణ నిర్వహిస్తారు ఈ సందర్భంగా రిజస్ట్రార్ మాట్లాడుతూ ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌ను నెలకొల్పిన తొలి వర్సిటీగా ఎయు నిలుస్తుందన్నారు. పరిశోధన ఆసక్తిని గుర్తించి, సమాజానికి ఉపయుక్తమైన పరిశోధనలు చేసేలా ప్రోత్సాహించడమే దీని ఉద్దేశమన్నారు. రెండు వారాల శిక్షణలో పరిశోధకుల నైపుణ్యాలను మరింత ద్విగుణీకృతం చేయడం ప్రధాన ఉద్దేశమన్నారు. విశ్వవిద్యాలయానికి పేరుతెచ్చే విధంగా వైవిధ్యమైన అంశాలపై పరిశోధనలు జరపాలని సూచించారు. ఆచార్య ఎన్ఎడి పాల్ సమన్వయకర్తగా వ్యవహరించిన కార్యక్రమాన్ని ఎయు టిడిఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్‌పర్యవేక్షిస్తున్నారు.

ఉక్కు జనరల్ ఆసుపత్రిలో రక్తదాతల దినోత్సవం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్ జనరల్ హాస్పిటల్‌లో ప్రపంచ రక్తదాతలు దినోత్సవం నిర్వహించారు. స్టాల్స్ ఏర్పాటు చేసి రక్తదానంపై అవగాహన కల్పించారు. రక్తదాతల వివరాలను నమోదు చేసుకున్నారు. ఆర్ఐఎన్ఎల్‌లోని బిఎస్‌జిహెచ్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించినకార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ కమాండర్ మహమ్మద్ మాట్లాడుతూ ఉద్యోగులు, ప్రజలు రక్త దాతలుగా మారాలని, తద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయాలని సూచించారు. ఇటీవల అప్‌డేట్ చేసిన ఆరు వేల మంది రక్తదాతలతో కూడిన వివరాలను విడుదల చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదులకు వైద్య బీమా గడువు నెలాఖరు వరకు పొడిగింపు

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : బార్ కౌన్సిల్ ఆఫ్ ఎపి ప్రవేశపెట్టిన న్యాయవాదులకు మెడికల్ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం రెండవ స్లాట్ కింద అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. ఈ స్కీం క్రింద రూ. 2 లక్షల వైద్య బీమాకు రూ.మూడు వేలు, రూ. మూడు లక్షల వైద్య బీమాకు రూ.4700 ధరావత్తును న్యాయవాదుల నుంచి స్వీకరించి మిగిలిన ప్రీమియం సొమ్మును ఆంధ్రప్రదేశ్ న్యాయమండలి, రాష్ట్ర గవర్నమెంట్ భరించి పాలసీ పట్టాలను న్యాయవాదులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ వైద్యబీమాలో చేరాలనుకునే న్యాయవాదులు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ లింక్ ద్వారా ప్రీమియం చెల్లించి పాలసీ పొందాలని సూచించారు ఈ సదావాకాశాన్ని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా న్యాయవాదులు ఉపయోగించుకుని వైద్య రక్షణ పొందాలని విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు సూచించారు.

గీతం విద్యార్థుల రక్తదానం

రక్తదానం చేస్తున్న గీతం విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న రక్తదాన శిబిరం గురువారం ముగిసింది. నర్సింగ్ స్కూల్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నర్సింగ్ విద్యార్థులు, వాలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి.లక్ష్మమ్మ రక్తదానం ప్రాధాన్యతను వివరించారు. అత్యవసర ప్రాణాపాయ పరిస్థితులలో ఉన్నవారి ప్రాణాలు కాపాడే విధంగా రక్తదానానికి ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు.ఒకరుచేసే రక్తదానంతో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని, అదే సమయంలో రక్తదానంతో దాతల ఆరోగ్యానికి కూడా ప్రయోజనం ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ రామారావు, టి.మాలతి, జిమ్సర్ వైద్య కళాశాల నిపుణురాలు డాక్టర్ అంజు చౌదరి పాల్గొన్నారు.

ప్రమాదాల్లో సహాయక చర్యలపై మాక్‌డ్రిల్

ప్రజాశక్తి-ఉక్కునగరం : అత్యవసర సమయాల్లో పాటించే భద్రతాచర్యలపై విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ప్లాంట్ లెవెల్ నైట్ టైం మాక్ డ్రిల్ నిర్వహించారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో ఎయిర్సెల్ యూనిట్లో ట్యాంక్ నుండి నైట్రోజన్ లీకేజీ అత్యవసర పరిస్థితుల్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో కాలిన గాయాలు, ఊపిరి ఆడకపోవడం వంటి సమస్యలు కృత్రిమంగా సృష్టించి, వాటిని ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు.ఉద్యోగులు పెద్దగా కేకలు వేయటం, కంట్రోలర్ వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం, ఆ విభాగ ఉద్యోగులతోపాటు సిఐఎస్ఎఫ్, ఫైర్ సెక్యూరిటీ, మెడికల్ సర్వీసెస్, గ్యాస్ సేఫ్టీ విభాగం, ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ సహ పలు స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలు అత్యవసర పరిస్థితిపై స్పందించి, నియంత్రణ చర్యలు చేపట్టడం, బాధిత సిబ్బందిని రక్షించడం వంటి చర్యలను మాక్‌డ్రిల్ చేసి చూపించారు. మొబైల్ అగ్నిమాపక శకటాలు, వాటర్ పంపింగ్ వ్యవస్థ, ప్రథమ చికిత్స, రెస్క్యూ పరికరాలు మొదలైనవి అత్యవసర సమయాల్లో స్పందించిన తీరును శివశంకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

మహిళా కోర్టు ఎపిపిగా గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్ : విశాఖపట్నంలోని ఆరవ అదనపు జిల్లా కోర్టు, మహిళా న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది గ్రంధి శ్రీనివాసరావు ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా తనను ఎంపిక చేసిన సిఎం జగన్మోహన్ రెడ్డికి శ్రీనివాసరావు శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధితులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

రామారావును సత్కరిస్తున్న నాయకులు

లోతా రామారావుకు సన్మానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఇటీవల రెండోసారి ఎన్నికైన సందర్భంగా లోతా రామారావును రాజవొమ్మంగిలోని ప్రజాసంఘాల కార్యాలయం వద్ద పలు సంఘాల నాయకులు గురువారం పూలమాలలు వేసి, దుస్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు పాశం శేషగిరి, కె.వెంకటలక్ష్మి, పి.రామరాజు, టి.శ్రీను, కె.జగన్నాథం మాట్లాడుతూ లోతా రామరావు మండలంలోని లోదొడ్డి సర్పంచ్‌గా, గిరిజన సంఘం నాయకునిగా గిరిజనులకు, నిరుపేదలకు సేవలు అభినందనీయమని కొనియాడారు. నిగర్వి, నిస్వార్థపరుడు, నిరారంబరుడు, గిరిజన, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పరితపించే లోతా రామారావు గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికవ్వడం మండలానికే గర్వకారణమని పేర్కొన్నారు. లోదొడ్డి సర్పంచ్‌గా పంచాయతీ అభివృద్ధికి చేసిన కృషి కారణంగానే రెండవసారి అఖండ మెజార్టీతో పంచాయతీ ప్రజలు గెలిపించారని తెలిపారు. రామారావు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, చేతివృత్తులదారుల సంఘం, ఇతర ప్రజా సంఘాల నాయకులు పాండవుల సత్యనారాయణ, పొత్తూరి సత్యనారాయణ, సీహెచ్ రాంబాబు, రాధ, ఎస్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సప్పర్ల పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలి

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు రక్షణ గోడ తక్షణమే నిర్మించాలని గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ అటవీ ప్రాంతానికి సమీపంలో ఉన్న సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు రక్షణ గోడ లేక విద్యార్థులకు ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సమీపంలోని అటవీ ప్రాంతంలో పులులు, గొర్రగేదెలు వంటి జంతువులు రాత్రి సమయంలో విచ్చలవిడిగా సంచరిస్తూ ఉంటాయని, ఈ క్రమంలో పాఠశాలలో ప్రవేశించి విద్యార్థులపై ఏ క్షణంలోనైనా దాడి చేయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నాడు నేడు నిధులు మంజూరు చేసినప్పటికీ రక్షణ గోడ నిర్మించకపోవడం దారుణమన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు.

నేడు 6 మండలాల్లో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం డివిజన్ పరిధిలోని రంపచోడవరం, గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాల్లో శుక్రవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈఈ యూసఫ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రంపచోడవరం 220/33కేవి సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఆయా మండలాల్లో సుమారు 650 గ్రామాల్లో ఉదయం 8 నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-కొయ్యూరు : నూతన ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన లాలం సీతయ్యను గురువారం కొయ్యూరు ఎంపిపి బడుగు రమేష్ బాబు, చింతపల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ జైతి రాజులమ్మ, వైసిపి మండల అధ్యక్షుడు జల్లి బాబులు కలిసి సాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, కలిసి సహకరించుకుంటూ ముందుకెళ్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ అచ్యుత్, జంపా రాజు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

సిపిఎం నాయకులు వెంకట్, శ్రీనివాస్

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - చింతూరు : మండలంలోని తుమ్మల గ్రామంలో సోడి వారి గుంపులో గత మూడు నెలలుగా మంచినీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే మంచినీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్, పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. గురువారం నాడు తుమ్మల గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ తీసుకొచ్చి ప్రజల వద్దకే అధికారులు వచ్చి సేవలు అందిస్తారని గొప్పలు చెబుతుందని తప్పా సచివాలయ పరిధిలో ఏ సమస్యలను పరిష్కరించకుండా చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తుమ్మల సచివాలయ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న సోడి గుంపుకు వేసవికాలమంతా మంచినీరు అందించలేని దౌర్భాగ్యస్థితిలో అధికారులు ఉన్నారని పేర్కొన్నారు. మంచినీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు మొరపెట్టుకుంటే సచివాలయ సిబ్బంది, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారని విమర్శించారు. తుమ్మల సచివాలయంలో మధ్యాహ్నం 12 దాటితే ఏ ఒక్క అధికారి ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గ్రామస్తులు చెబుతున్నారని తెలిపారు. ఆన్లైన్ వర్క్ ఉందని చెప్పి చింతూరు కేంద్రానికి వెళ్ళిపోతున్నారని, దీనితో ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే గ్రామస్తులను కదిలించి తుమ్మల సచివాలయం ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మొట్టం రాజయ్య, మొట్టం నాగేశ్వరరావు, మొట్టం రాజ్ కుమార్, సోడి లెనిన్, మొట్టం చామంతి, పోడియం సుబ్బారావు, మొట్టం నాగేష్, కోర్స నారాయణ, ఉయిక నాగేశ్వరరావు, కొరసా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగానే టెండర్లు : మంత్రి బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో ఐదు లక్షల మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు, 20 వేల మంది టీచర్లకు ట్యాబ్‌లు ఇచ్చామని, వాటి కొనుగోలుకు పారదర్శకంగా టెండర్లు పిలిచామని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం విశాఖలోని వైసిపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 12 నుంచి వచ్చే నెల 12లోపు ఇంటరాక్టివ్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి విద్యా బోధన చేయడానికి నిర్ణయించామన్నారు. దానికిగాను 10 వేల స్కూల్స్‌లో స్మార్ట్‌టీవీలను కూడా పెట్టడానికి కొనుగోలు చేశామని తెలిపారు. అవకతవకలు జరిగాయని ఓ పత్రికలో వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు.

ఎరియర్స్ తక్షణమే చెల్లించాలి

జిసిసి కార్యాలయం ఎదుట హమాలీల ఆందోళన

ధర్నా చేస్తున్న జిసిసి హమాలీలు

ప్రజాశక్తి-చింతూరు : ఎరియర్స్ తక్షణమే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన జిసిసి హమాలీలు గురువారం చింతూరు జిసిసి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ 2022 జనవరి నుండి 2023 ఫిబ్రవరి వరకు క్వింటాకు మూడు రూపాయల చొప్పున పెంచిన డబ్బుల యొక్క ఎరియర్స్ చెల్లించాల్సి ఉందని తెలిపారు. ఈ ఎరియర్స్ చెల్లించకుండా ఐటిడిఎ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. తక్షణమే ఎరియర్స్ చెల్లించకపోతే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమీటీ సభ్యులు స్వామి, జిసిసి హమాలీలు చంద్రయ్య, ముత్తయ్య, సుబ్బయ్య, రాజయ్య, సీతారామయ్య, రామనాగు, తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో మండుతున్న ఎండలు

ప్రజాశక్తి - కొయ్యూరు
ఏజెన్సీలోనూ ఎండలు మండి పోతున్నాయి. కొన్ని రోజులుగా ఎండలు ఎక్కడా తగ్గడం లేదు. గురువారం కొయ్యూరులో 41.8 డిగ్రీలో ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రత, వడగాలులతో ప్రజలు బెంబెలెత్తిపోతున్నారు. పడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జూన్ నెలలో ఈ స్థాయి ఎండల తీవ్రత ఎన్నడూ చూడలేదని ప్రజలు వాపోతున్నారు. ఉక్కపోత, వేడి పగలు రాత్రి తేడా లేకుండా జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

గ్రామంలో నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమం

'జన్ భాగీదారీ'పై అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల : మండలంలోని ఎల్లవరం, గొంటువానిపాలెం అంగన్వాడీ కేంద్రం వద్ద గురువారం జన్ భాగీదారీ కార్యక్రమం నిర్వహించారు. ఎల్లవరంలో స్థానిక ఎంపీటీసీ సూర్యకాంతం, సిడిపిఓ దీప్తి, గొంటువానిపాలెంలో స్థానిక సర్పంచ్ పల్లాల ఏగులమ్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులు ఇక్కడ ఇస్తున్న పౌష్టికాహారం గురించి మిగిలిన వారికి తెలియజేసిన వారి పిల్లలను కూడా అంగన్వాడీ కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ కుమారి బత్తిన ఉషారాణి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దిశా యాప్‌పై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-కొయ్యూరు : మహిళలకు, ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీసులు త్వరగా స్పందించే దిశా యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌను లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కొయ్యూరు ఎస్సై రాజారావు సూచించారు. మండలంలో గురువారం దిశా యాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ఈ దిశా యాప్ రూపొందించడం జరిగిందని తెలిపారు.

ప్రమాదంలో జనసేన కార్యకర్త మృతి

ప్రజాశక్తి-కొయ్యూరు : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బుధవారం అన్నవరంలో నిర్వహించిన సభకు హాజరైన మండలంలోని బాలారం గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త చందక బంగారురాజు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. బహిరంగ సభ అనంతరం బంగారురాజు అనంతరం తిరిగి వస్తుండగా, తునిలో రోడ్డు క్రాస్ చేస్తున్న సమయంలో గుర్తు తెలియని కారు అతన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బంగారురాజు మృతి చెందాడు. ఢీ కొట్టిన కారు ఆగకుండా వెళ్లి పోయిందని స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటనతో మండలంలోనూ, బాలారం గ్రామంలో విషాధం చోటుచేసుకుంది.

మద్యం స్వాధీనం

ప్రజాశక్తి -మోతుగూడెం : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుండి 32 క్వార్టర్ సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... మోతుగూడెం పోలీసు స్టేషన్ పరిధి లక్కవరం గ్రామానికి చెందిన సరపాక వెంకటలక్ష్మి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు ముందస్తు సమాచారంతో గురువారం పోలీసులు ఆమె ఇంట్లో తనిఖీలు చేశారు. ఇంట్లో ఉన్న 32 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలు వెంకటలక్ష్మిని అరెస్టు చేసి రంపచోడవరం కోర్టుకు తరలించారు. ఈ కార్యక్రమంలో మోతుగూడెం ఎస్ఐ పట్టాభిరామ్, హెడ్ కానిస్టేబుల్ సత్తిబాబు, సన్నీ, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.